
## నేటి ప్రజావాణి రద్దు

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 4 : ములుగు కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ టీఎస్ దివాకర ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉన్నందున ప్రజావాణిని రద్దు చేస్తునట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలు గమనించాలని ఆయన కోరారు. వచ్చే సోమవారం యధావిధిగా ప్రజావాణి ఉంటుందని అన్నారు.



# మాఫీ.. టెన్షన్!

- రుణమాఫీపై రైతుల్లో ఆందోళన
- అన్ని అర్హతలున్నా.. మాఫీ కాలేదని అన్నదాతల దిగాలు
- తెల్ల రేషన్‌కార్డు, కుటుంబంలో ఒకరికే మాఫీ నిబంధనలతో ఆవేదన
- ఫిర్యాదులు స్వీకరిస్తున్నా.. ఎప్పటిలోపు పరిష్కరిస్తారో చెప్పని అధికారులు
- ఉమ్మడి జిల్లాలో రెండు విడతల్లో 2,08,077మందికి రూ.1,506.5కోట్లు మాఫీ
- అర్హులైన రైతులందరికీ వర్తింపజేయాలని విజ్ఞప్తి



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

రైతు రుణమాఫీపై అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అన్ని అర్హతలున్నా మాఫీ జాబితాలో తమ పేర్లు రావడం లేదని.. ఖాతాల్లో సొమ్ములు జమ కావటం లేదని టెన్షన్ పడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం రెండు విడతల్లో రుణమాఫీ చేసింది. అయితే వేలాది మంది రైతుల తమకు రుణమాఫీ కావటం లేదని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఒకే ఇంటి పేరుతో వివిధ గ్రామాల్లో ఉన్న రైతులందరినీ ఒకే కుటుంబంగా చూపుతుండగా.. రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవటం లేదని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పకి రేషన్ కార్డు ఆధారంగానే మాఫీ జరుగుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2,08,077మంది రైతులకు రూ.1,506.50కోట్ల రుణాలను మాఫీ చేసింది. ఈ నేపథ్యంలో రెండు విడతల్లో రుణమాఫీ కాని రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నా అవీ ఎప్పటిలోగా మాఫీ అవుతుందో స్పష్టం చేయకపోవటంతో రైతుల్లో ఆందోళన చెందుతున్నారు.

### రూ.1,506.50కోట్ల రుణాలు మాఫీ

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 2,08,077మంది రైతులకు రూ.1,506.50కోట్ల రుణాలను మాఫీ చేసింది. ఇందులో తొలి విడతలో వరంగల్ రూరల్ జిల్లాలో 30,148 రైతులకు రూ.165.07కోట్లు, రెండో విడతలో 21,166మంది రైతులకు రూ.190.58కోట్లు రుణమాఫీ చేసింది. రెండు విడతల్లో వరంగల్ రూరల్ జిల్లాలో మొత్తం 51,314మందికి రూ.355.65కోట్ల రుణ మాఫీని ప్రభుత్వం చేసింది. అలాగే వరంగల్ అర్బన్ జిల్లాలో తొలి విడత రూ.1లక్ష మాఫీని 19,013 మందికి రూ.102.67 కోట్లు, రెండో విడత రూ.లక్షన్నర మాఫీని 11,818మందికి రూ.108.24కోట్లు మాఫీ చేసింది. మొత్తంగా రెండు విడతల్లో వరంగల్ అర్బన్ జిల్లాలోని 30,831మంది రైతులకు రూ.210.91కోట్ల రుణమాఫీ జరిగింది. అలాగే జనగామ జిల్లాలో తొలి విడతలో 23,749మంది రైతులకు రూ.133.27కోట్లు, రెండో విడతలో 15,401మందికి రూ.159.80కోట్లు రుణమాఫీ చేశారు. జనగామ జిల్లాలో రెండు విడతల్లో మొత్తం 39,150మందికి రూ.293.07కోట్ల రుణమాఫీ జరిగింది. అలాగే మహబూబాబాద్ జిల్లాలో తొలి విడతలో 26,621మంది రైతులకు రూ.150.22కోట్లు, రెండో విడతలో 19,443మందికి రూ.193.47కోట్ల రుణమాఫీ జరిగింది. మొత్తంగా మహబూబాబాద్ జిల్లాలో రెండు విడతల్లో 46,064మంది రైతులకు రూ.343.69కోట్ల రుణమాఫీని ప్రభుత్వం చేసింది. అలాగే భూపాలపల్లి జిల్లాలో మొదటి విడతలో 14,079మంది రైతులకు రూ.79.74 కోట్లు, రెండో విడతలో 8,851మంది రైతులకు రూ.92.50కోట్లు రుణమాఫీ చేశారు. భూపాలపల్లి జిల్లాలో రెండు విడతల్లో 22,930 మందికి రూ.172.24 కోట్లు మాఫీ జరిగింది. అలాగే ములుగు జిల్లాలో మొదటి విడతలో 11,573మంది రైతులకు రూ.65.69 కోట్లు, రెండో విడతలో 6,215మంది రైతులకు రూ.65.25కోట్ల రుణమాఫీ జరిగింది. రెండు విడతల్లో ములుగు జిల్లాలో మొత్తం 17,788మంది రైతు ఖాతాల్లో రూ.130.94కోట్ల రుణమాఫీ నిధులను ప్రభుత్వం జమ చేసింది. మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రెండు విడతల్లో 2,08,077 రైతు ఖాతాలకు రూ.1,506.50కోట్ల నిధులను ప్రభుత్వం జమ చేసింది. రాష్ట్రంలో అత్యధికంగా రుణ మాఫీ జరిగిన జిల్లాలో ఉమ్మడి వరంగల్ జిల్లా మూడో స్థానంలో నిలిచింది.

### కొందరికేనా రుణమాఫీ?

ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ పథకం రైతులందరికీ వర్తించకపోవటంతో గందరగోళ పరి స్థితి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హ మీ మేరకు రైతు రుణమాఫీకి శ్రీకారం చుట్టింది. 2018 డిసెంబరు 12వ తేదీ నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ వరకు బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతు లకు మాత్రమే రుణమాఫీగా కటాఫ్ డేట్‌ను ప్రకటించింది. అసలు, వడ్డీ కలిపి రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు తొలి విడత జూలై 18వ తేదీన లక్ష లోపు రుణం తీసుకున్న రైతులకు రుణ మాఫీ ప్రకటించింది. అలాగే జూలై 30వ తేదీన రూ.1.50లక్షల లోపు రుణమాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రైతుల్లో హర్షాకేతనాలు వ్యక్తం అయ్యాయి. అయితే రుణమాఫీలోని నిబంధనలు, టెక్నికల్ సమస్యలతో అనేక మంది రైతులకు రుణమాఫీ కాకపోవటంతో ఆందోళన చెందుతున్నారు.

**ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అయిన రుణమాఫీ వివరాలు**

| జిల్లా | రైతు ఖాతాలు | రెండు విడతల్లో మాఫీ |
|---|---|---|
| వరంగల్ రూరల్ | 51,314 | రూ.355.65కోట్లు |
| వరంగల్ అర్బన్ | 30,831 | రూ.210.91కోట్లు |
| జనగామ | 39,150 | రూ.293.07కోట్లు |
| మహబూబాబాద్ | 46,064 | రూ.343.69కోట్లు |
| భూపాలపల్లి | 22,930 | రూ.172.24కోట్లు |
| ములుగు | 17,788 | రూ.130.94కోట్లు |
| మొత్తం | 2,08,077 | రూ.1,506.50కోట్లు |

### రుణమాఫీకి సమస్యలెన్నో?

రైతు రుణమాఫీలో అనేక సమస్యలు రైతులను గందర గోళానికి గురి చేస్తున్నాయి. ప్రధానంగా ఒకే కుటుంబంలో ఒకరికే రుణమాఫీ వర్తిస్తుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. రుణమాఫీకి

మిగతా 7వ పేజీలో..

### అన్ని అర్హతలున్నా రుణమాఫీ కాలేదు

- బోళ్ల మౌనిక, రైతు, జడలేపేట, భూపాలపల్లి జిల్లా



చిట్యాల డీసీసీ బ్యాంకులో రూ.54వేల అప్పు ఉంది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో నా పేరు కనిపించలేదు. ఇదే విషయమై వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాను. అయితే ఆధార్‌లోని పేరు.. రుణ ఖాతాలోని పేరు వేర్వేరుగా ఉందని చెప్పారు. అయితే అన్నింట్లో కరెక్ట్‌గానే పేరు ఉంది. ఏలాంటి తేడాలు లేవు. అధికారులు దరఖాస్తు ఇవ్వమంటే ఇచ్చాను. రుణమాఫీ ఎప్పుడు చేస్తారో చెప్పటం లేదు.

### నో డేటా ఫౌండ్ చూపుతోంది

- బీసు రాజు, చిన్నగూడూరు, మానుకోట జిల్లా



చిన్నగూడూరు మండలంలోని జయారం ఇండియన్ బ్యాంకులో రూ.31,000 రుణం తీసుకున్నా, మొదటి విడతలో రుణమాఫీ కాలేదు. వ్యవసాయశాఖ అధికారులను సంప్రదిస్తే కంప్యూటర్‌లో నో డేటా ఫౌండ్ చూపుతోందని చెబుతున్నారు. అధికారులకు దరఖాస్తు ఇచ్చినప్పటికి రెండో విడతలో మాఫీలో కూడా పేరు రాలేదు. రుణమాఫీ అవుతుందో లేదో కూడా అధికారులు చెప్పటం లేదు.

- హనుమకొండ జిల్లా పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన సిద్దోజు కృష్ణమూర్తికి బ్యాంకులో రూ.80వేలు ఆయన కుమారుడికి రూ.35వేల రుణం ఉంది. ఒకే రేషన్‌కార్డు ఉండటంతో తొలి విడతలో రుణ మాఫీ కాలేదు. రెండవ విడతలో ప్రభుత్వం లక్షన్నర రుపాయల మాఫీ చేసింది. అయితే కృష్ణమూర్తి, ఆయన కుమారుడికి కలిపి రూ.1,25,000లే అప్పు ఉన్నప్పటికి రుణమాఫీ కాలేదు. అధికారుల తప్పిదం వల్లే తనకు రుణమాఫీ కాలేదని బాధితుడు వాపోతున్నారు.
- మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాలకు చెందిన రైతు రావుల సీతారామ్‌రెడ్డి కేజీవీ బ్యాంకులో రూ.1.65లక్షల రుణం ఉండేది. గత మే నెలలో లక్ష రుణం బ్యాంకుకు చెల్లించగా, ఇంకా రూ.65వేల రుణం బ్యాంకులో ఉంది. తొలివిడతలో రుణమాఫీ కాకపోవటంతో సీతారామ్‌రెడ్డి వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించారు. అయితే రైతు పేరు మీద రూ.1.65లక్షల రుణం ఉన్నట్లుగా సైట్‌లో చూపిస్తుందని, రూ.2లక్షల రుణ మాఫీలో మాఫీ అవుతుందని సమాధానం ఇస్తున్నారని, అయితే తాను బ్యాంకులో చెల్లించిన రూ.1లక్ష ఏమైనట్లని బాధిత రైతు ఆందోళన చెందుతున్నారు.
- భూపాలపల్లి జిల్లా జంగేడుకు చెందిన గోగు నల్లసమ్మయ్య అదే గ్రామానికి చెందిన సహకార బ్యాంకులో రూ.40వేల లోను తీసుకున్నారు. తొలి విడత మాఫీలో నల్లసమ్మయ్యకు రుణమాఫీ కాలేదు. ఇదే విషయమై బ్యాంకు అధికారులను సంప్రదిస్తే.. వ్యవసాయ శాఖ అధికారులను అడు గాలని, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తే బ్యాంకులో తెలుసుకో వాలని తిప్పుతున్నారని బాధిత రైతు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- ములుగు జిల్లా వాజేడుకు చెందిన కుర్సం నాగేశ్వర్‌రావు ఏపీజీవీ బ్యాంకులో రూ.58వేల రుణం తీసుకున్నారు. మొదటి విడతలోనే రుణ మాఫీ కావాల్సి ఉన్నప్పటికి నాగేశ్వర్‌రావుకు రుణమాఫీ జరగలేదు. వ్యవసాయశాఖ అధికారులను సంప్రదిస్తే.. కుటుంబ సభ్యుల నిర్ధారణ కాక పోవటంతో రుణమాఫీ కావటం లేదని సమాధానం ఇస్తున్నారని రైతు వాపోతున్నారు.



రామప్ప నందీశ్వరుడి వద్ద పర్యాటకులు

## రామప్పలో పర్యాటకుల సందడి

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 4: మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా తూర్పు ముఖద్వారాన ఉన్న నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి తమ కెమెరాల్లో బంధించుకున్నారు. ఆలయ విశిష్టత, చరిత్ర గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి రామప్ప సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపారు.

## బొగత అదరహో..

**జలపాతం అందాలకు పర్యాటకుల ఫిదా**

వాజేడు, ఆగస్టు 4: తెలంగాణ నయాగరా బొగత అందాలకు పర్యాటకులు ఫిదా అవుతున్నారు. ములుగు జిల్లా వాజేడు మండలంలో ఉన్న బొగత జలపాతం అందాలు మంత్ర ముగ్ధుల్ని చేస్తున్నాయి. చుట్టూ పచ్చని చెట్లు, నీలిరంగులో ఉన్న ఆకాశం.. అల్లంత ఎత్తు నుంచి జాలువారుతున్న తెల్లటి జలధారలను చూస్తుంటే ఎవరైనా అదరహో అనాల్సిందే. ఇన్నాళ్ల మబ్బులు కమ్ముకొని ఉన్న వాతావరణం ఇప్పుడిప్పుడే మామూలు స్థితికి వస్తున్న తరుణంలో నీలాకాశం మాటున బొగత అందాలు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. ఆదివారం జలపాతం అందాలను తిలకించేందుకు వేల సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులతో బొగత పరిసర ప్రాంతం కిక్కిరిసిపోయింది. ముచ్చటగొలిపే జలపాతం అందాల ను పర్యాటకులు కెమెరాలలో బంధిస్తూ సెల్ఫీలు దిగుతూ మురిసిపోయారు.



## మేడారం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

- రాష్ట్ర బడ్జెట్‌లో రూ.50కోట్లు కేటాయింపు
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- జాతర అభివృద్ధిపై అధికారులతో సమీక్ష



మేడారంలో మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి సీతక్క

మేడారం, ఆగస్టు 4: మేడారం జాతర శాశ్వత అభివృద్ధి కోసం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. సమ్మక్క, సారలమ్మల కీర్తిని భవిష్యత్ తరాలకు గొప్పగా అందించేలా ప్రణాళికలు ఉండాలన్నారు. మేడారం అభివృద్ధి కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.50కోట్లను ఐటీడీఏ ద్వారా కేటాయించడం జరిగిందన్నారు. వచ్చే మహాజాతర నాటికి మేడారాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేలా కృషి చేయాలన్నారు. మంత్రి సీతక్క ఆదివారం తాడ్వాయి మండలం మేడారంలో పర్యటించారు. భక్తుల వసతి కోసం నిర్మించిన పగిడిద్దరాజు, గోవిందరాజు భవనాల వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో రైతులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. వనమహోత్సవంలో భాగంగా కలెక్టర్ దివాకర, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీ, ఇతర అధికారులతో కలిసి మొక్కలు నాటారు. వనదేవతల పరిసరాలు పకృతి అందాలు, పచ్చని చెట్లు కనిపించేలా ఉండాలని తెలిపారు. అందుకు రైతులు పండ్ల తోటలు పెంచాలని కోరారు. భక్తులు కూడా మొక్కలతో వనదేవతలకు మొక్కులు చెల్లించి మేడారం పరిసరాలలో నాటాలని సూచించారు.

ఐటీడీఏ అతిథి గృహంలో తహసీల్దార్ రవీందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడారం అభివృద్ధి పనుల సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. 2024 మహా జాతరలో చేపట్టిన పనుల ఖర్చుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరిలో జరిగిన మహా జాతర నిర్వహణ, సదుపాయాల కల్పన కోసం రూ.110కోట్లు కేటాయించగా, సివిల్ వర్క్‌ల కోసం రూ.66కోట్లు, జాతర నిర్వహణకు రూ.24కోట్లను ఖర్చు చేయడం జరిగిందన్నారు. మిగతా రూ.20 కోట్లకు అదనంగా ఇటీవల బడ్జెట్ సమావేశాల్లో ఐటీడీఏ ద్వారా కేటాయించిన రూ.50కోట్లతో మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులు చేస్తామన్నారు. రూ.17 కోట్లతో మేడారంలో

మిగతా 8వ పేజీలో..

## క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించాలి

- డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం..
- ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ



మాట్లాడుతున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం, ఆగస్టు 4: యువత క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించాలని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి వాటికి యువత దూరంగా ఉండాలని సూచించారు. ఏటూరునాగారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్స్ మండల కేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్ పాఠశాల మైదానంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని ముల్లెకట్ట, కొండాయి(ఏ) జీపీ-1, ఆకులవారిఘణపురం(ఏ), ఎక్కెల, రాంపూర్, కొమరం భీమ్‌నగర్, రొయ్యూరు(ఏ), ఆకులవారిఘణపురం(బీ), హనుమాన్ నగర్, చల్పాక(ఏ), రొయ్యూరు(బీ), రామన్నగూడెం, భూటారం, చల్పాక(బీ), చల్పాక(యూత్), షాపల్లి (ఏ), షాపల్లి(బీ), కొండాయి(బీ), రాంనగర్, లాంబాడితండా తదితర గ్రామాల నుంచి మొత్తం 17 జట్లు పాల్గొంటున్నాయి. ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. నేటి ఓటమే రేపటి గెలుపునకు నాంది అన్నారు. ఓటమిపాలైన క్రీడాకారులు నిరుత్సాహం చెందొద్దన్నారు. యువతకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేస్తూనే క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ క్రీడల్లో గెలుపొందిన టీం విజేతలకు బహుమతులతో పాటు జిల్లా స్థాయిలో జరిగే మెగా టోర్నీలో పాల్గొనే అవకాశం దక్కుతుందని ఏఎస్పీ తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. డ్రగ్స్, గంజాయి, మద్యపానం వ్యసనాలతో జీవితాలు నాశనం అవుతాయన్నారు. ఎవరికైనా డ్రగ్స్, గంజాయి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. సమాచారం అందించిన వారికి నగదుతో పాటు బహుమతి అందించడం జరుగుతుందన్నారు. సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడంలో కళాశాల విద్యార్థులు ముందుండాలని, ప్రజలను, యువకులను చైతన్యం చేయాలని సూచించారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలన పోస్టర్లను జర్నలిస్టులతో కలిసి ఏఎస్పీ ఆవిష్కరించారు. కాగా, తొలిరోజు వాలీబాల్ పోటీలు పోటాపోటీగా జరిగాయి. ఈ క్రీడలు ఈనెల 7 వరకు జరగనున్నాయి.


కార్యక్రమంలో సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై ఎస్‌కె.తాజుద్దీన్, రెండో ఎస్సై రమేష్, ఐజేయూ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గంపల శివకుమార్, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి అలువాల శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు నూక ప్రభాకర్, వసంత రమేష్, చింతలపల్లి వెంకటేశ్వర్లు, పెండ్యాల ప్రభాకర్, ఎగడి వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకులు ఎమ్డీ.దావూద్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎట్టి స్వరూప, రాజు, క్రీడాకారులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కాళేశ్వరాలయంలో భక్తుల సందడి

## శ్రావణం.. శివుడికి ప్రీతికరం

- నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం
- కాళేశ్వరాలయంలో భక్తుల ప్రత్యేక పూజలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



మహదేవపూర్, ఆగస్టు 4: అడవిసిగలో అనంత జలసిరి.. అందాల కోనలో ఆధ్యాత్మిక పెన్నిధి. సాక్షాత్తూ సమవర్తితో కూడిన ఆదిదేవుడి అద్భుత లీలాచిత్రికకు నిలయమైన నేల అది. అతిప్రాచీన చరిత్ర గల కాళేశ్వర క్షేత్రానికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. ముక్కంటికి నిలయమైన మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి క్షేత్రం శ్రావణ మాసానికి సిద్ధమైంది. సోమవారం నుంచి శ్రావణమాసం మొదలుకానుంది. పరమశివుడికి ప్రత్యేకమైన సోమవారం రోజే శ్రావణ మాసం ప్రారంభమవడం విశేషం. దీంతో కాళేశ్వరాలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్నారు. దక్షిణ కాశీగా పేరొందిన ఈ క్షేత్రంలో శ్రావణమాస ప్రత్యేక పూజలకు ఆలయ ఈవో, అర్చకులు ఏర్పాట్లు చేశారు. గోదావరి, ఆలయ పరిసరాలు నేడు శివనామ స్మరణతో మార్మోగనున్నాయి. ఒకే పానవట్టంపై ఉన్న రెండు శివలింగాలకు బిల్వ దళాలతో అర్చకులు పూజలు నిర్వహించనున్నారు.

### ప్రత్యేకంగా లక్షపత్రి పూజ

శ్రావణ మాసంలో పరమశివుడికి లక్షపత్రి పూజ చేయడం విశేషం. పరమశివుడికి బిల్వ దళాలతో పాటు శుభానందదేవి, జ్ఞానప్రసూనాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సోమ, శుక్ర, శని, ఆది వారాల్లో లక్షపత్రి పూజలు నిర్వహిస్తారు. లక్ష పత్రి పూజ ప్రాశస్త్యం కలది. ప్రతి రోజు నిర్వహించే పూజలకు 45మంది జంటలు ఆలయ కార్యాలయంలో ఇప్పటికే నమోదు చేసుకున్నారు. కాగా, ఈ లక్ష పత్రి పూజకు ప్రతీ భక్తుడు రూ.6,500 చెల్లించాలని ఆలయ ఈవో మారుతి తెలిపారు. 11మంది అర్చకులు పత్రి పూజలో పాల్గొని క్రతువును నిర్వహిస్తారు. శ్రావణ మాసంలో ప్రత్యేకంగా నాగుల పంచమి, సామూహిక వరలక్ష్మి ప్రత్యేక పూజలు, వ్రతాలు, శ్రావణ శుక్రవార పూజలు, ఉపవాస దీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేయనున్నారు.

### గోదావరిలో స్నానాలు

శ్రావణ మాసంలో నదీస్నానం చేస్తే పాపాలు తొలగిపోయి పుణ్యాలు వస్తాయని నానుడి. ఈ క్రమంలో త్రివేణి సంగమ కాళేశ్వరానికి నదీ స్నానం చేయడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేస్తారు.

### కాలసర్ప నివారణ దోషాలు

కాళేశ్వరాలయంలో శ్రావణ మాసంలో మంగళ, గురు శనివారాల్లో

మిగతా 8వ పేజీలో..

## 'ప్రైవేటు ఉపాధ్యాయులపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు సరికావు'

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 4 : రాష్ట్రంలోని ప్రైవేటు ఉపాధ్యాయులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సబబు కాదని ఆల్ ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు చందర్‌లాల్ చౌహాన్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ హనుమ కొండలోని ఏకశిల పార్కులో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద ర్‌లాల్ మాట్లాడుతూ... ప్రైవేటు పాఠశాలల్లో అర్హతలేని ఉపాధ్యా యులన్నప్పుడే మీ బిడ్డనే ప్రభుత్వ పాఠశాలలో ఎందుకు చదివించలేదని ప్రశ్నించారు. అర్హత లేని ఉపాధ్యాయులు పనిచేసే ప్రైవేటు పాఠశాలల్లోనే మంత్రులు, ఎమ్మెల్యేలు, చివరకు ప్రభుత్వ ఉపాధ్యాయులు పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో ఎందుకు చదివిస్తున్నారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని బీఈడీ, డీఈడీలు, పీజీలు చేసిన వారు బ్రతుకుదెరువు కోసం ప్రైవేటు పాఠశాలల్లో విద్యాబోధన చేస్తూ రాష్ట్రంలో ఉత్తమ ఫలితాలు సాధిస్తుంటే ముఖ్యమంత్రికి కళ్లు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతీ ప్రైవేటు పాఠశాలలో అర్హతగల ఉపాధ్యాయులే విద్యాబోధన చేయడంతోనే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రైవేటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రెండు లారీలు ఢీ

### అక్కడికక్కడే డ్రైవర్ మృతి.. మరో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 4: రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.... మంగపేట మండలం మల్లూరు గ్రామానికి చెందిన చీర్ల యాకయ్య గౌడ్(36) కమలాపురానికి చెందిన ఓ లారీ యజమాని వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో ఆదివారం అదే మండలంలోని చుంచుపల్లిలో గల ఇసుక క్వారీ నుంచి ఇసుకను లోడ్ చేసుకొని వరంగల్ వెళ్తున్నాడు. ఈక్రమంలో 163వ జాతీయ రహదారిపై ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి-తాడ్వాయి మధ్యలోకి చేరుకోగానే వరంగల్ నుంచి ఏటూరునాగారం వైపు వస్తున్న మరొక లారీ అదుపుతప్పి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఇసుక లోడుతో వెళ్తున్న లా రీ డ్రైవర్ చీర్ల యాకయ్యగౌడ్ అక్కడిక క్కడే మృతి చెందాడు. మరొక లారీ డ్రైవర్ జస్టిస్ సింగ్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానిక సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రజిని ఉంది. ఈ విష యం తెలుసుకున్న స్థానిక ఎస్సై తాజుద్దీన్ సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలను చేపట్టారు.



ఎదురెదురుగా ఢీకొన్న లారీలు

## అప్పజోష్యులకు సాహిత్య పురస్కారం ప్రదానం

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 4 : నగరంలోని సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ సహకారంతో హైదరాబాద్‌లోని అనంతలక్ష్మీ కాంతం శారద పీఠం వారి ఆధ్వర్యంలో ఆదివారం వడ్డెపల్లిలోని పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో రేవూరి లక్ష్మీకాంతారావు శతజయంతి సభను ఘనంగా నిర్వహించారు. సహృదయ అధ్యక్షుడు గిరిజా మనోహర్‌బాబు అధ్యక్షతన జరిగిన సభను ఆచార్య బన్న ఐలయ్య జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో భాగంగా అబోవిబో అధ్యక్షుడు ప్రముఖ సాహిత్యవేత్త అప్పజోష్యుల సత్యనారాయణకు రూ.25 వేల నగదుతో పాటు ప్రత్యేక ప్రశంసాపత్రం, దుశ్శాలువాతో అనంత లక్ష్మీకాంత సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు టిఎస్ఎన్. మూర్తి అప్పజో ష్యుల బహుముఖ పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని ప్రజ్ఞను విశేషంగా చెప్పారు. ప్రసార భారతి న్యూఢిల్లీ విశ్రాంత అదనపు డైరెక్టర్ డాక్టర్ రేవూరి పద్మనాభరావు, అనంత లక్ష్మీకాంత సాహితీ పురస్కార విశేషాలను వివరిస్తూ గతంలో రావూరి భరద్వాజ, ఎస్పీ బాలసుబ్రమణ్యం, దారా రామనాథశాస్త్రి, కేవీ.రమణా చార్యులకు ప్రదానం చేసి ఈసారి అప్పజోష్యుల సత్యనారాయణను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో వనం లక్ష్మీకాంతారావు, అంపశయ్య నవీన్, డాక్టర్ ఎస్‌విఎస్.చారి, డాక్టర్ గంజి వెంకటరత్నం, జూలూరి నాగ రాజు, కళా రాజేశ్వర్‌రావు, దినకర్, రామోజు సుందరమూర్తి తదితర అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు.




పురస్కారం అందుకుంటున్న అప్పజోష్యుల సత్యనారాయణ




























# మాఫీ.. టెన్షన్!

(5వ పేజీ తరువాయి)

తెల్ల రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవటం లేదని ప్రభుత్వం ప్రకటించినప్పటికి అదే కారణంతో చాల మంది రైతులకు రుణమాఫీ కావటం లేదు. అలాగే వివిధ గ్రామాల్లో ఒకే ఇంటి పేరుతో ఉన్న రైతులను ఒకే కుటుంబంగా చూపిస్తుండటంతో రుణమాఫీ కావటం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కొంత మంది రైతులకు బ్యాంకు ఖాతాల్లో, పాస్ పుస్తకాల్లో ఉన్న పేరుకు ఆధార్ కార్డులో అక్షరం తప్పుగా ఉన్న రుణమాఫీ చేయటం లేదని రైతులు వాపోతున్నారు. తండ్రీ, కొడుకులకు లక్షకు పైగా రుణం ఉండటంతో రెండవ విడత లక్షన్నర మాఫీలో అవకాశం వస్తుందని భావించినప్పటికి నిరాశే మిగిలింది. ఇలా వేలాది మంది రైతులకు వివిధ కారణాలతో రుణమాఫీ టెన్షన్ పెడుతుంది. అయితే ఇలాంటి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతుల నుంచి వస్తున్న ఫిర్యాదులను వ్యవసాయ శాఖ అధికారులు సేకరిస్తున్నారు. రైతుల నుంచి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందపర్చి పై అధికారుల దృష్టికి తీసుకెళ్లుతున్నారు.

## ఘనంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు



కొత్తగూడలో కేక్‌కట్ చేస్తున్న జేఎల్‌ఎన్‌వైసీ అధ్యక్షుడు రణధీర్

కొత్తగూడ, ఆగస్టు 4 : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం యువకులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొని ఫ్రెండ్ షిప్ బ్యాండ్‌లను కట్టుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ యువజన సంఘం (జేఎల్‌ఎన్‌వైసీ) అధ్యక్షుడు మల్లెల రణధీర్ కేక్ కట్‌చేసి స్నేహితులకు అం దజేశారు. ఈ కార్యక్రమంలో మల్లెల రాము, వెల్దండి శ్రీను, నల్లూరి సారంగపాణి, బోనాల లక్ష్మీనారాయణ, ఇరుప సుధాకర్, శ్రీకాంత్, సిరిగిరి సురేష్, కృష్ణ, మహేందర్, చందు పాల్గొన్నారు.

## బల్దియాలో నేటి ప్రజావాణి రద్దు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 4 : బల్దియాలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల ఈ వారం రద్దు చేస్తున్నట్లు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి రద్దు అయిన నేపథ్యంలో సోమవారం బల్దియా కార్యాలయానికి ఫిర్యాదులతో ఎవరూ రావద్దని ఆమె కోరారు.









# సకల శుభాల శ్రావణం



- నెలంతా శుభ ఘడియలే
- మోగనున్న పెళ్లి బాజాలు
- నోములు, వ్రతాలకు ముహూర్తాలు
- కళకళలాడనున్న వ్యాపారాలు
- ఫంక్షన్ హాళ్లకు ఫుల్ గిరాకీ

కొడకండ్ల ఆగస్టు 4: హిందూ సంప్రదాయంలో శ్రావణమాసానికి అత్యంత పవిత్రమైన నెలగా ప్రత్యేక స్థానముంది. చంద్రుడు శ్రవణా నక్షత్రంలోకి ప్రవేశించినప్పటి నుంచి శ్రావణమాసంగా పిలుచుకుంటారు. అలాగే శ్రీ మహావిష్ణువు జన్మనక్షత్రం కూడా శ్రవణా నక్షత్రం కావడంతో శ్రావణమాసానికి ఆ పేరు వచ్చింది. ఉత్తర భారతదేశంలో ఆచరించే సూర్యమానం ప్రకారం అక్కడ జూలై 22కే ప్రారంభమైనా దక్షిణాదిలో ఆచరించే చంద్రమానం ప్రకారం ఇక్కడ సోమవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుంది. విష్ణుమూర్తికి, శివుడికి, లక్ష్మీదేవికి చాలా ఇష్టమైన మాసంగా పరిగణిస్తారు.

### మాసమంతా నోములు, వ్రతాలు, పండుగలే..

శ్రావణమాసంలో మహిళలు అనేక వ్రతాలు, నోములు చేసుకుంటారు. తమకు సౌభాగ్యాన్ని ఇవ్వాలని, కుటుంబం ఆర్థికంగా పరిపుష్టి కావాలని మంగళగౌరీ వ్రతం, వరలక్ష్మీ వ్రతాలను నిర్వహిస్తారు. నాలుగు మంగళవారాల్లో మంగళ గౌరీ వ్రతాన్ని, పౌర్ణమికి ముందు వచ్చే రెండో శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాన్ని చేసుకుంటారు. సోమవారాలు శివుడికి పంచామృతాలతో అభిషేకం చేసుకుంటే ఫలితం ద్విగుణీకృతం అవుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ నెల 8వ తేదీన నాగుల చవితి, 9న నాగపంచమి, 16 న వరలక్ష్మీ వ్రతం, 17 న శనిత్రయోదశి, 19 న రాఖీ పౌర్ణిమ, శనిత్రయోదశి, 22 న సంకష్ట చతుర్థి, 26 న కృష్ణాష్టమి, హయగ్రీవ జయంతి పండుగలు వస్తున్నాయి.

### మోగనున్న పెళ్లిబాజాలు..



గురు, శుక్ర మూఢాలు రావడం వల్ల గత 3 నెలలు వైశాఖ మాసం, జ్యేష్ఠమాసం, ఆషాఢమాసాలలో ఎలాంటి శుభముహూర్తాలు లేవు. దాంతో వివాహ సంబంధాలు ఖాయమైనా శుభముహూర్తాల కోసం ఎదురు చూస్తున్నారు. శ్రావణ మాసంలో శుభముహూర్తాలు ఉండటంతో వివాహాలు, గృహప్రవేశాలు తదితర శుభకార్యాలు జరుగనున్నాయి. ఆ తర్వాత వచ్చే భాద్రపదమాసంలో కూడా వివాహ ముహూర్తాలు ఉండనందువల్ల శ్రావణమాసంలో శుభకార్యాలు అధిక సంఖ్యలో జరిగే అవకాశం ఉంది. వివాహ వ్యవస్థపైన ఆధారపడ్డ ఫంక్షన్ హాల్ల యజమానులు, బ్యాండ్ మేళం, టెంట్ యజమానులు, పురోహితులు, పూల దుకాణదారులు, బట్టల షాపుల, నగల షాపుల యజమానులు, లైటింగ్, డీజే, డెకొరేషన్ చేసేవాళ్ళు , కేటరింగ్, వంటవాళ్ళు, గొర్ల, కోళ్ళ పెంపకందార్లు , అద్దె కార్లు, బస్సుల యజమానులు, వివిధ కుల వృత్తుల వారు గత 3 నెలల నుంచి చేతిలో పనిలేక తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. శ్రావణంలో అధిక సంఖ్యలో శుభకార్యాలు జరుగనున్నందున ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### పోటెత్తనున్న ఆలయాలు

వరంగల్ కల్చరల్ : సోమవారం నుంచి శ్రావణ సందడి నెలకొననుంది. భద్రకాళి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుంటారు. సోమవారాల్లో నగరంలోని రామలింగేశ్వర, దుర్గేశ్వర, భోగేశ్వర, కాశీ విశ్వేశ్వర , ఆకారపు వారి గుడి, బొమ్మల గుడి, రంగంపేట శివాలయం , దత్తక్షేత్రం, కాశిబుగ్గ శివాలయం అభిషేకాలు కొనసాగుతాయి. గురువారాల్లో సాయిబాబా ఆలయాల్లో, శనివారాలు గీతా భవనంలోని శ్రీవేంకటేశ్వర స్వామి, బట్టల బజార్‌లోని శ్రీ వేంకటేశ్వరాలయం, డాక్టర్స్ కాలనీలోని శ్రీవేంకటేశ్వర ఆలయం, లక్ష్మీనర్సింహస్వామి దేవాలయాలతో పాటు నగరంలోని అన్ని ఆంజనేయస్వామి దేవాలయాల్లో అభిషేకాలు, అర్చనలు, ప్రసాద వితరణ భోగాలు నిర్వహిస్తారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ములుగురోడ్‌లోని ఇస్కాన్ మందిరంలో పోతన రోడ్డులోని మురళీకృష్ణ మందిరంలో, గీతాభవన్‌లోని కృష్ణా ఆలయంలో, భద్రకాళి అమ్మవారిని శ్రీకృష్ణుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా నెలలో వచ్చే ప్రతీ శుక్రవారం అమ్మవారికి పూజలు, అన్నదానాలు జరుగుతాయి.

### మాకు చేతినిండా పని ఉంటుంది..



**పొన్నం వెంకటేశ్వర్లు, టెంటు షాపు యజమాని**

ఫంక్షన్ హాళ్లు పెరిగిన తర్వాత మా టెంట్‌షాపులకు చాలావరకు గిరాకీ తగ్గింది. ప్రతీ సంవత్సరం వేసవి సీజన్‌లో వందల వివాహాలు జరిగేవి. మాకు చేతినిండా పని దొరికేది. ఇప్పుడా పరిస్థితి లేదు. కేవలం బయట ఫంక్షన్లు చేసుకునేవాళ్లతో మాకు కొంత పని దొరికేది. కానీ ఈ వేసవిలో పనులు లేక మా దగ్గర పని చేసేవాళ్ళకు వేతనాలు ఇవ్వడం కూడా కష్టమైంది. మాతో పాటు ఈ వ్యవస్థపై ఆధారపడ్డ వృత్తుల వారు కూడా దాదాపు 3 నెలల కాలం పనులు లేవు. ఈ శ్రావణమాసంలో శుభకార్యాలు అధికంగా ఉన్నందువల్ల మాకుకూడా చేతినిండా పని దొరుకుతుందని ఆశిస్తున్నాం.

### శ్రావణంలో సుముహూర్తాలు ఉన్నాయి..



**పాలకుర్తి గౌతం సిద్ధాంతి, కొడకండ్ల**

వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢమాసాలలో మౌఢ్యమి వల్ల ముహూర్తాలు లేకపోవడంతో వివాహసంబంధాలు కుదిరినా పెళ్ళి చేయడానికి సుమూహూర్తాల కోసం చాలామంది ఆగి ఉన్నారు. శ్రావణమాసంలో సుమూహూర్తాలు బాగానే ఉండటంతో శుభకార్యాలకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అనేక వివాహాలకు ముహూర్తాలు పెట్టాము. ఆ తర్వాత వచ్చే భాద్రపద మాసంలో ముహూర్తాలు ఉండవు. అందుకని శ్రావణంలో వర్షాలు పడే ప్రమాదమున్నా చాలామంది వివాహాలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

## హుషారెత్తించేలా.. షికారు

● భీమునిపాదంకు పెరుగుతున్న పర్యాటకులు

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 4 : ఎత్తైన కొండలు.. అరుదైన వృక్షాలు.. అబ్బురపరిచే భీమునిపాదం జలపాతం వద్ద పర్యాటకుల సందడి రోజు రోజుకు పెరుగుతోంది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ అటవీప్రాంతంలో ఉన్న భీమునిపాదం ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు 70 ఫీట్ల ఎత్తునుంచి వాటర్‌ఫాల్స్ జాలువారుతున్నాయి. పచ్చని ప్రకృతి నడుమ ఆహ్లాదకరమై వాతావరణంలో 70 ఫీట్లఎత్తు నుంచి జాలువారే వాటర్‌ఫాల్స్ కింద తడుస్తూ, పర్యాటకులు సందడి చేస్తూ కేరింతల నడుమ ఆనందంగా గడుపుతున్నారు. భీమునిపాదం గుట్టపై పచ్చని ప్రకృతిని ఆస్వాదించేందుకు వాచ్‌టవర్ కూడా ఉండడంతో పలువురిని ఆకర్షిస్తోంది. ఆదివారం సెలవు దినం కావడం, మరోపక్క స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్నేహితులు సరదాగా గడిపేందుకు భీమునిపాదం వచ్చారు. దీంతో పర్యాటకుల సందడి పెరిగింది. భీమునిపాదం పర్యాటక కేంద్రంగా ప్రభుత్వం గుర్తించడంతో ఆ ప్రాంతం అభివృద్ధి చేందుతుందని సంబంధిత అధికారులు తెలిపారు.



గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ అటవీప్రాంతంలోని భీమునిపాదం జలపాతం వద్ద పర్యాటకుల సందడి

## డెంగీతో ఆదివాసీ యువకుడు మృతి



అనిల్ (ఫైల్)

గూడూరు (మహబూబాబాద్), ఆగస్టు 4 : డెంగీతో బాధపడుతూ చికిత్సపొందుతున్న ఆదివాసీ యువకుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మర్రిమిట్టలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. మర్రిమిట్టకు చెందిన తాటి సుగుణ-లక్ష్మయ్య దంపతులకు ఇద్దరు కుమారులు సునిల్, అనిల్ సంతానం. చిన్నకుమారుడు తాటి అనిల్ (23) కొద్దిరోజులుగా డెంగీజ్వరంతో బాధపడుతున్నాడు. తొలుత గూడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అనంతరం నర్సంపేట, హన్మకొండ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నప్పటికి ఆరోగ్య పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అనిల్ మృతదేహం వద్ద నివాళ్లర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

# నేటి నుంచి స్వచ్ఛదనం- పచ్చదనం

**పారిశుధ్య నిర్వహణ... గ్రీనరీ పెంపు లక్ష్యం**

**ఈనెల 9 వరకు కొనసాగింపు**



వర్ధన్నపేట/మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 4 : గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సోమవారం (నేటి) నుంచి 9వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. నిర్దిష్ట లక్ష్యాన్ని చేరుకునేలా రోజువారిగా కార్యాచరణను విజయవంతంగా అమలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు, మరో ముగ్గురు సభ్యులతో కూడిన బృందం, పట్టణాల్లో వార్డు అధికారి, ప్రత్యేక అధికారుల బృందం కార్యక్రమ అమలు బాధ్యత వహించాల్సి ఉంటుంది. జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తారు.

● 5న స్థానిక నాయకులు, స్వయం సహాయక సంఘాలు, యువజన, వార్డుకమిటీ సభ్యులతో ర్యాలీ నిర్వహించాలి. గృహస్థాయిలో చెత్తను వేరు చేయడంపై అవగాహన కల్పించి వ్యర్థాలతో ఎరువు తయారు చేయాలి. వ్యక్తిగత పరిశుభ్రత, కాలానుగుణ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై పాఠశాలల్లో ఉపన్యాస, వ్యాస రచన పోటీలు నిర్వహించాలి. వీధులు, బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాలు, పీహెచ్‌సీలు, బస్టాండ్లు శుభ్రం చేయాలి. పారిశుధ్య వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ పరికరాలు ఏర్పాటు చేయాలి. వ్యక్తిగత మరుగుదొడ్లు లేని గృహాలను గుర్తించి నిర్మించుకునేలా చూడాలి.

● 6న తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలి. నీరు సరఫరా అయ్యే పాయింట్ల వద్ద క్లోరినేషన్ పరీక్షచేయాలి. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడానికి ఇంకుడు గుంతలులేని ఇళ్ల వద్ద వాటిని నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలి. చెరువులు, కుంటలను సందర్శించి వాటి సంరక్షణపై చర్చించాలి.

● 7న రహదారులపై నీరు నిలిస్తే తగిన చర్యలు తీసుకోవాలి. మురుగు కాల్వల్లో పూడికను తొలగించాలి. వర్షపునీరు, మురుగు నీరు కాల్వల్లోకి మళ్లించాలి.

● 8న వీధి కుక్కల ముప్పుపై దృష్టిపెట్టాలి. డెంగీ, మలేరియా, కాలానుగుణ వ్యాధులను నివారించడానికి జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి. వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది జ్వర సర్వే నిర్వహించాలి. యాంటీలార్వా, ఫాగింగ్ చేపట్టాలి. చెరువుల్లో గంబూషియా చేపలు వదలాలి.

● 9న గ్రామాల్లో, పట్టణాల్లో అన్ని కుటుంబాలు డ్రై డేగా పాటించేలా చూడాలి. నిల్వ ఉన్న నీటిని తొలగించాలి. ఇళ్లలో ఉపయోగించని వస్తువులను తొలగించేలా చూడాలి. స్క్రాప్, టైర్ పంక్చర్ దుకాణాలు తనిఖీ చేయాలి. ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాల పైకప్పులను శుభ్రం చేయాలి. శిథిలమైన భవనాలు, గోడలను తొలగించాలి.

### వన మహోత్సవంలో..

గ్రామాల్లో, పట్టణాల్లో వన మహోత్సవం కింద మొక్కలు నాటాలి. అట వీసరిహద్దు ప్రాంతాల్లో అటవీ జంతువులకు ఉపయోగపడే అటవీ ఉత్పత్తి జాతులను పెంచాలి. రహదారుల పక్కన, పాఠశాలలు, ఇతర ప్రభుత్వ సంస్థల్లో మొక్కలు నాటాలి. ప్రతీ ఇంటికి కనీసం ఆరు మొక్కలు పంపిణీ చేయాలి. పంచాయతీ, మునిసిపల్ స్థలాలను గుర్తించి రక్షణ కల్పించాలి.

### ఇక నుంచి ప్రతీ నెల మూడో శనివారం..

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 5 నుంచి 9 వరకు నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఇంతటితో ఆపకుండా ఎప్పటికి జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. భవిష్యత్‌లో దానికి కొనసాగించేందుకు ప్రతి నెల మూడో శనివారం రోజున అన్నిగ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛదనం-పచ్చదనంను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## సాహిత్యం సమాజ దిక్సూచి కావాలి

కథల అర గ్రంథావిష్కరణలో ప్రముఖులు



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న టి.రాజేశ్వర్‌రావు

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 4 : సాహిత్య ప్రక్రియ ఏదైనా సమాజంలో కొంత మందికైన ఉపయుక్తంగా ఉంటూ దిక్సూచిగా మార్గదర్శనం చేయాలని వరంగల్ నగర మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ అంజనీదేవి కలం నుంచి జాలువారిన కథల అర గ్రంథాన్ని డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పర్చ కోదండరామరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఎనిమిది పదుల వయస్సులోనూ నిత్య నూతనంగా అద్భుత కథలను ఆవిష్కరింపజేసిన అంజనీదేవిని అభినందించారు. ఆచార్య డాక్టర్ మాడభూషి శ్రీధర్ ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితునిగా పాల్గొని మాట్లాడుతూ.. అటు విద్యారంగంలో కోదండరామారావు, వైద్య రంగంలో డాక్టర్ అంజనీదేవిలో ఎనిమిది పదుల వయస్సులోనూ ఇంకా చేస్తున్న కృషిని అభినందించారు. ఇరువురు వారి రంగాల్లో చేస్తున్న సామాజిక సేవను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆచార్య కాత్యాయిని విద్మహే, నెల్లుట్ల రమాదేవి, పొట్లపల్లి శ్రీనివాసరావు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సోమరాజ్ తదితరులు ఈ గ్రంథంలోని 15 కథల తీరుతెన్నులపై ప్రసంగించారు. డాక్టర్ అంజనీదేవి మాట్లాడుతూ తన స్వీయానుభవంలో జరిగిన సంఘటనలు నిత్య జీవితంలో ఎదుర్కొన్న వాస్తవాల నుంచి సాహిత్య అభిరుచి మేరకు రాసుకున్న కథలు గ్రంథంగా రావడం ప్రశంసలందుకోవడం ఎంతో తృప్తినిచ్చిందన్నారు. తమ్మెర రాధిక, డాక్టర్ వాసిరెడ్డి భాస్కర్‌రావు పాల్గొన్నారు.

## 'అర్హతలు లేని వారికి ఉద్యోగాలు ఎలా ఇస్తారు'

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 4: అర్హతలు లేని వారికి గ్రూప్-1 ఉద్యోగాలు ఎలా ఇస్తారని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునిల్, డీఎంఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్‌లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఆదివారం కేయూ ఎస్డీఎల్‌సీఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో వారు మాట్లాడుతూ... ఇండియన్ క్రికెటర్ మహ్మద్ సిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగాలు ఇస్తానని ఇటీవల అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి అర్హతలే లేని వారికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వారికి ఉద్యోగాల ప్రకటన నిరుద్యోగులను అవమానప రిచినట్లేనన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి నిరు ద్యోగులకు క్షమాపణలు చెప్పాలన్నారు. వారిని క్రీడాశాఖ మంత్రులుగాను, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్లుగా నియమిస్తే మంచిదని హితవు పలికారు. ఈ విషయమై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాస్తున్నామన్నారు. ఈ లేఖను ప్రజాప్రయోజన వ్యాజ్యంగా తీసుకొని ఇచ్చిన ఉద్యోగాలను వెనక్కి తీసుకునేట్లు చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తిని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఠాగూర్, వెంకట్, నాని, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 4 : హనుమకొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా మహ్మద్ అజీజ్‌ఖాన్, ఆకుల సారంగపాణి, ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఆదివారం హనుమకొండ కేయూ రోడ్డులోని ఎస్. ఎస్ ఫంక్షన్‌హాల్లో హనుమకొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఎన్నికల పరిశీలకులుగా కర్తయ్య, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బైరబోయిన కైలాస్‌యాదవ్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. హనుమకొండ జిల్లా చీఫ్ ప్యాటరన్‌గా అడిషినల్ ఎస్పీ పుల్లా శోభన్‌కుమార్, ఛైర్మన్ సోదా రామకృష్ణ, అధ్యక్షుడుగా మహ్మద్ అజీజ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల సారంగపాణి, కోశాధికారిగా చెమ్మ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కె. కృష్ణరెడ్డి, కుమారస్వామి, టి. సంపత్‌రావు, పి. రమేష్, ఎ. ప్రభాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ఎండీ. అక్రంఖాన్, పి. రాజమౌళి, జి. రమేష్‌గౌడ్, ఎండీ. సద్దాం హుస్సేన్, బి. ప్రభాకర్, ఈసీ మెంబర్లుగా బిన్ని. లక్ష్మణ్, సృజన్‌కాంత్‌లను ఏకగ్రీకంగా ఎంపిక చేశారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఏకగ్రీవంగా నియామితులైన హనుమకొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గం

### వరంగల్ జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవం...

వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి మహ్మద్. అబ్దుల్లా ఖాన్, కోశాధికారి బి. ముఖర్జీ ఉపాధ్యక్షులుగా ఎ. సాయిలు, షబ్బీర్‌ఆలీ, బొట్ల ప్రతాప్, బి. రవీణ, నారాయణ, సంయుక్త కార్యదర్శులుగా కక్కెర్ల మల్లికార్జున్, ఎండీ. అక్తర్, కె. సాంబమూర్తి, జి. బాబులను ఎన్నికల పరిశీలకు కర్తయ్య ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈ సమవేశంలో వరంగల్ జిల్లా డీవైఎస్‌వో సత్యవాణి, ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ అజీజ్‌ఖాన్, కైలాస్‌యాదవ్, కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

## 160 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

వరంగల్ క్రైం, ఆగస్టు 4 : చిల్పూర్‌లో అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ రైస్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని రూ.3లక్షల 52వేల విలువైన 160 క్వింటాళ్ల రైస్‌ను స్వాధీనం చేసుకున్నారు. చిల్పూర్ మండలం రాజవరం గ్రామానికి చెందిన ఎం.దేవేందర్ పరిసర గ్రామాల్లో తక్కువ రేటుకు పీడీఎస్ రైస్ కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ఇతర ప్రాంతాలకు అమ్ముతుంటాడు.

అక్రమంగా నిలువ చేసినట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడులు చేసి రైస్ స్వాధీనం చేసుకుని దేవేందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం చిల్పూర్ పోలీస్ స్టేషన్‌లో దేవేందర్‌ను అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ ధృవీకరించారు.

## ఘనంగా స్నేహితుల దినోత్సవం


కాటారంలో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న మహిళలు

కాటారం, ఆగస్టు 4: మండలంలో స్నేహితుల దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోనూ ఫ్రెండ్‌షిప్ డేను యువకులు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు. చిన్నారుల నుంచి పెద్దవారి వరకు తమ స్నేహితులకు స్నేహ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. గారెపల్లిలో పలువురు మహిళలు ఆటపాటలతో కిట్టీ పార్టీలు చేసుకుంటూ ఫ్రెండ్‌షిప్ డేను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు, యువతీ యువకులు, రాజకీయ నాయకులు, అధికారులు, ప్రజలు తమ స్నేహితులకు వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌ల ద్వారా స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. యువత సామూహిక విందు, వినోదాలతో జరుపుకున్నారు.

## ఏడు గ్రామాలకు నిలిచిపోయిన బస్సు సౌకర్యం

మొగుళ్లపల్లి, ఆగస్టు 4: హనుమకొండ డిపోకు చెందిన బస్సులు గత 20 రోజుల నుంచి గ్రామాలకు రాకపోవడంతో ఏడు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హనుమకొండ నుంచి ఎర్రగట్టు గుట్ట, అంబాల, కమలాపూర్, వంగపల్లి, మర్రిపెల్లిగూడెం మీదుగా వెంకటేశ్వర్లపల్లి నుంచి మండలంలోని మొట్లపల్లి క్రాస్, నర్సింగాపురం, వేములపల్లి, గుడిపాడు, బంగ్లపల్లి గ్రామాలకు ప్రతి రోజు రెండు బస్సు సర్వీసులు నడుస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేవి. కాగా, 20రోజుల క్రితం కురిసిన వర్షాలకు రోడ్డు ధ్వంసమై గుంతలు ఏర్పడడంతో ఆర్టీసీ అధికారులు బస్సులను నిలిపివేశారని ప్రజలు చెబుతున్నారు. నిత్యం వివిధ పనుల నిమిత్తం హనుమకొండ, వరంగల్ పట్టణాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు, ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సత్యనారాయణరావు స్పందించి ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

## నాలుగేళ్ల చిన్నారిపై వీధికుక్క దాడి

గణపురం, ఆగస్టు 4: నాలుగేళ్ల చిన్నారిపై వీధి కుక్క దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ ఘటన గణపురం మండలం చెల్పూరులోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టుకాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. చిన్నారి తండ్రి రొంటాల చంద్రశేఖర్ తెలిపిన వివరాలిలా వున్నాయి. తన పెద్దకూతురు శర్మిలారెడ్డిని కేటీపీపీ కాలనీలోని ఓ డ్యాన్స్ స్కూల్‌లో శిక్షణ కోసం తీసుకువచ్చాడు. చిన్న కూతురు అభిజ్ఞరెడ్డి తనతోపాటే వచ్చిందని తెలిపారు. ఈక్రమంలో సమీపంలోని పార్కులో కూర్చోగా చిన్న కూతురు ఆడుకుంటుంది. ఈనేపథ్యంలో అక్కడికి వచ్చిన ఓ వీధి కుక్క ఆకస్మాత్తుగా పాపపై దాడి చేసింది. దీంతో కాలుకు నాలుగుచోట్ల తీవ్రంగా గాయమైంది. తేరుకున్న తండ్రి కుక్కను తరిమికొట్టి పాపను వెంటనే సమీపంలోని 100 పడకల ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అయితే కేటీపీపీ కాలనీలో కుక్కలు, కోతుల బెడద ఉందనిజెన్‌కో ఉన్నతాధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోయారు.


## రేపు గద్దర్ వర్ధంతి సభ

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 4: భూపాలపల్లి పట్టణంలోని భారత్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 6న ప్రజా యుద్ధనౌక, గాయకుడు గద్దర్ ప్రథమ వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ నాయకుడు గాజర్ల అశోక్ తెలిపారు. ఆదివారం భారత్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్దర్ వర్ధంతి సభ సందర్భంగా మొదటగా అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అలాగే పక్కనే ఉన్న అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి అనంతరం అక్కడి నుంచి ప్రధాన రహదారి మీదుగా ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీగా వెళ్లనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు సంస్మరణ సభ ప్రారంభం అవుతుందని తెలిపారు. ప్రజలు, కళాకారులు, మేధావులు విజయవంతం చేయాలని కోరారు.

## సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన పోలీసులు


సీపీఆర్ చేస్తున్న కానిస్టేబుళ్లు

గోవిందరావుపేట, ఆగస్టు 4: మండలంలోని పస్రా చౌరస్తాలో ఛాతిలో నొప్పితో స్పృహ కోల్పోయిన ఓ వ్యక్తిని ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లు సీపీఆర్ చేసి కాపాడారు. రాష్ట్ర మంత్రి సీతక్క ఆదివారం తాడ్వాయి మండలం మేడారం పర్యటనకు వెళ్లారు. బందోబస్తులో భాగంగా పస్రాలో కానిస్టేబుళ్లు బి.మధు, ఎల్.మధు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈక్రమంలో వర్ధం లక్ష్మణ్ అనే వ్యక్తి గుండె పోటుకు గురై కుప్పకూలిపోయాడు. వెంటనే స్పందించిన కానిస్టేబుళ్లు ఆయనకు సీపీఆర్ చేయడంతో కొద్దిసేపటికి స్పృహలోకి వచ్చాడు. ఆతర్వాత 108లో ములుగు ఏరియా వైద్యశాలకు తరలించారు. రక్షణ విధుల్లో ఉంటూ పౌరుడి ప్రాణాలు కాపాడిన పోలీసులను స్థానికులు అభినందించారు.


**WANTED**

★ Wanted Teacher & Telecallers Math's to teach up to 8th Class. Part Time / Full Time / Residential. Salary : 10000/- Near KUC, HNK. Cont : 9849157056

AJW-188384

**WANTED**

★ ప్రముఖ ఆఫీసులలో పని చేయుటకు రిసెప్షనిస్ట్‌లు, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ కావలెను. జీతం : 8000 – 10000/-. సం.ప్ర॥ 9440414616

AJW-199062

**WANTED TEACHERS**

★ To Teach Pre-Primary (Good at English) Substitute Teacher (Male / Female) Ayahs Avanthi High School, Beside : Zoo Park, hunter Road, HNK, Cell : 9666024024, 9666025025

AJW-27624

**WANTED**

★ సఖి సెంటర్ HNKలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్-1 మహిళ అభ్యర్థి కావలెను. 10th PASS అయి వుండి 5సం॥ల అనుభవం. సెక్యూరిటీ గార్డ్‌గా గవర్నమెంట్ లేదా ఏదైనా సంస్థలో అర్హత పొందినవారు కావలెను. Email : syongo@gmail.com. Cont : 9948412090

AJW-199051

**JOBS / WANTED**

★ RK INFRA STRUCTURE, DTCP-LAOUT & FARMLANDS, HANUMAKONDA లో పని చేయుటకు స్త్రీ/పురుషులు Agents / Tele Callers. వెంటనే కావలెను. సం.ప్ర॥ 8019868773

AJW-5716

**WANTED**

★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / వర్కులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 20k. Phone : 8977639662 / 8977639663

AJH-4211

**సెక్యూరిటీగార్డ్స్ & సూపర్‌వైజర్స్ కావలెను**

★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్, సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 12000–15000. సం.ప్ర॥ 8688072125

AJW-199063

**WANTED**

★ Wanted Sales Executives for RUDRA SCIENTIFIC LAB INSTRUMENTS, Hanamkonda. Qlf : Degree/Diploma/ 10+2, Freshers or 1-2 Years Exp. Attractive Salary + Incentives. Contact : 6303671845, 9902945663. Email : rudrascientificlab@gmail.com

AJW-188383

**PLOT FOR SALE**

★ ఖాజీపేట, సిద్ధార్థనగర్‌లో ఇ.నెం. 1-1-939 గల 1500 చ॥గజాలు (West & North Face) ప్లాటు అమ్మబడును. సం.ప్ర॥ 7702745430

AJW-188389

**LAND FOR SALE**

★ భూపాలపల్లిలో 12 గుంటల వ్యవసాయ భూమి అమ్మబడును. సంప్రదించవల్సిన ఫోన్ నెంబర్. 9912824104

AJW-199057

**కూడా లే అవుట్ ప్లాట్స్ అమ్మబడును**

★ హన్మకొండకు అతి దగ్గరలో కూడా లే అవుట్ ప్లాట్స్ అమ్మబడును. కొనబడును. TR REAL ESTATE & PROPERTY SHOW ROOM, Thupakula Plaza, KU 100feet Road, HNK సం.ప్ర॥ 9533398666

AJW-199064

**సిద్ధి వినాయక వాటర్ ప్రూఫింగ్**

★ మీ ఇల్లు కారుతుందా! స్లాబ్ లీకేజ్, గోడ చెమ్మలు, గోడ క్రాకులు, స్లాబ్ పెచ్చులు ఊడిపోతున్న బాత్‌రూమ్ లీకేజీలు బ్రాండెడ్ కెమికల్స్‌తో టెక్నికల్‌గా 10 సం॥ గ్యారంటీతో వాటర్ ప్రూఫింగ్ చేయబడును. సంప్ర.9032541833

AJH-002551

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

**ప్రకటనల కొరకు సంప్రదించండి**

హన్మకొండ
9985400013
8978510273
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232


# జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 4: ములుగు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఆదివారం మండలంలోని నందిపహాడ్ గ్రామంలో నిర్మాణ్ సంస్థ, ఆడమా మద్దతు ద్వారా గ్రామ దత్తత, స్వచ్ఛమైన తాగునీటి కోసం బోర్‌వెల్, వాటర్ ట్యాంకు, కమ్యూనిటీ మరుగుదొడ్లు, కమ్యూనిటీ షెడ్లు, వీధిలైట్లు, జంతువుల కోసం నీటి ట్యాంకులు, గృహాల కోసం లైటింగ్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాల్లో స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించడంలో దాతల సహకారం ఎంతో గొప్పదన్నారు. తాను గతంలో కరోనా సమయంలో చేసిన సహాయం చిన్నదని, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కార్యక్రమాలు గొప్పవని అన్నారు. కొన్నిరోజుల క్రితం తక్కలపాడు గ్రామంలో ఓ బాలిక పాఠశాల నిర్మించాలని ఆవేదన వ్యక్తం చేయడంతో తాను జిల్లా అధికారులను ఆదేశించి వెంటనే పాఠశాల నిర్మాణం చేయాలని కోరినట్లు తెలిపారు. దీంతో కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్‌లు స్పందించి పక్షం రోజుల్లో పాఠశాలను నిర్మించారని, దానిని ఈ రోజు ప్రారంభించడం జరిగిందని అన్నారు.

ములుగు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి జిల్లా అధికారులు సహకరించిన విషయాన్ని ఎప్పటికీ మరచిపోనని మంత్రి సీతక్క తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని దట్టమైన అడవిలో నివసిస్తున్న ప్రజలకు మరుగుదొడ్లు, మంచినీటి వాడకం, తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించడానికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని, ఈ విషయమై త్వరలోనే సమీక్ష సమావేశం నిర్వహిస్తానని అన్నారు. గ్రామాల్లోని ప్రజలు ఐక్యతతో అభివృద్ధిని సాధించుకోవాలని, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలాభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని, అన్ని గ్రామాలను మోడల్ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని అన్నారు. కలెక్టర్ టీఎస్.దివాకర మాట్లాడుతూ మంత్రి సీతక్క సూచనతో జిల్లాను అభివృద్ధి చేసేందుకు ముందుకు పోతున్నామని అన్నారు. స్వచ్ఛంద సంస్థలకు తాము ఎల్లవేళలా సహకారం అందిస్తామని, గ్రామాలాభివృద్ధి కోసం వివిధ స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఓఎస్డీ గీతే మహేష్ బాబాసాహెబ్, డీఎస్పీ రవీందర్, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నేటి ప్రజాదివస్ రద్దు : ఎస్పీ

కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఆగస్టు 4: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజాదివస్‌ను సోమవారం రద్దు చేస్తున్నట్లు ఎస్పీ కిరణ్ ఖరే ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. అనివార్య కారణాల వలన ఒక్క రోజు కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. మళ్లీ వచ్చే సోమవారం యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు.

## ఉపాధి హామీ డబ్బులు చెల్లించాలి

గోవిందరావుపేట, ఆగస్టు 4: ఉపాధి హామీ పనుల డబ్బులను కూలీలకు వెంటనే చెల్లించాలని సీపీఎం పార్టీ పస్రా గ్రామ కార్యదర్శి కడారి నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పస్రాలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూలీలు ఉపాధి హామీ పనులు చేసి మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు వారి ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని అన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి కూలీల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని కోరారు. లేనట్లయితే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సోమ మల్లారెడ్డి, అంబాల మురళి, పల్లపు రాజు, జిట్టబోయిన రమేష్, క్యాతం సూర్యనారాయణ, కందుల రాజేశ్వరి, మంచాల కవిత, కారం రజిత పాల్గొన్నారు.

## పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

గణపురం, ఆగస్టు 4: పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఐ రెండవ మండల మహాసభ మండల కార్యదర్శి విజేందర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా రాజ్‌కుమార్ హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ నిత్యం పోరాటాలు చేసేది సీపీఐ పార్టీయేనని అన్నారు. అసెంబ్లీలో కూడా పేదల పక్షాన, సంఘటిత, అసంఘటిత రంగాలపై గొంతెత్తి మాట్లాడుతుందని తెలిపారు. ఈ మహాసభకు సుమారు 150 మంది హాజరయ్యారు. ఈ సమావేశంలో నాయకులు సొత్కు ప్రవీణ్, సుగుణ, పోశం, భాస్కర్, శంకర్, సుధాకర్, సదానందం, కృష్ణ, నగేష్, లీలా, రవళి, ప్రమీల పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంకు కూల్చివేత



కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఆగస్టు 4: భూపాలపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో సుమారు 20ఏళ్ల కిందట నిర్మించిన వాటర్ ట్యాంకును మునిసిపల్ అధికారులు కూల్చివేశారు. ప్రస్తుతం ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో పాటు పెచ్చులు ఊడి పడుతుండటంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. తహసీల్దార్ కార్యాలయానికి ప్రతి రోజూ వందల సంఖ్యలో ప్రజలు వస్తుండగా ట్యాంకు కిందే సేద తీరుతున్నారు. కాగా, శిథిలావస్థకు చేరి ఉండటంతో ఎప్పుడైనా కూలవచ్చునని భావించిన అధికారులు దాన్ని కూల్చివేశారు. ఈ వాటర్ ట్యాంకు ద్వారా భూపాలపల్లి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు సైతం తాగునీటిని సరఫరా చేసినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు ట్యాంకును కూల్చే సమయంలో రోడ్డుకు నలుదిక్కులా ఎవరిని అనుమతించకుండా పోలీసులు భారీకేడ్లు ఏర్పాటు చేశారు. ట్యాంకు పూర్తిగా కూలి నేలమట్టమైన తదుపరి రాకపోకలకు అనుమతి ఇచ్చారు.

## షెడ్యూల్డ్ తెగల వర్గీకరణకు కమిషన్ నియమించాలి

- తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్

గోవిందరావుపేట, ఆగస్టు 4: ఆదివాసీ గిరిజన జాతుల్లో వర్గీకరణ నిర్వహించడం కోసం ప్రత్యేక కమిషన్‌ను నియమించాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పస్రాలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1950 నుంచి నివసించే ఆదివాసీ గిరిజనులకే వంద శాతం ఉద్యోగ అవకాశాల రిజర్వేషన్ కల్పించాలని, ఆదివాసీగిరిజనుల ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ అంశాలను పరిగణలోకి తీసుకుని వర్గీకరణ చేయాలన్నారు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం ప్రయత్నం చేయకూడదని, నాడు బీసీ కులాల్లో ఉన్న లంబాడీలను ఎస్టీ తెగలలో కలపడం వల్ల ఉద్యోగ, విద్య, రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో ఆదివాసీలు వెనుకబడిపోయారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదివాసీ గిరిజన జాతుల్లో వర్గీకరణ చేపట్టాలని కోరారు. సమావేశంలో తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, కోకన్వీనర్లు పోడెం రత్నం, యాసం రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంపుడి వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి చింత కృష్ణ, నాయకులు గొంది రామచంద్రయ్య, వట్టం కన్నయ్య, పూనెం బాలకృష్ణ, వట్టం జనార్దన్, మహేష్, మల్లెల రాంబాబు, శ్రీనివాస్, ఎర్రయ్య, సురేష్, శ్రావణ్, ముత్యాలరావు, తాటి సీలాద్రి, సంపత్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు మంత్రి సీతక్క పరామర్శ

గోవిందరావుపేట, ఆగస్టు 4: మండలంలోని పస్రాలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సమ్మక్క, సారలమ్మ పూజారి కాక సంపత్ కుటుంబాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఆదివారం పరామర్శించారు. అదేవిధంగా మొట్లగూడెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కుర్సం కన్నయ్యను పరామర్శించారు. మొద్దులగూడెం గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదం సంభవించి ఇల్లు కోల్పోయిన పిట్టల నర్సయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.15వేల నగదుతోపాటు 50కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, బ్లాక్, మండల, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 4: ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జిల్లాలోని 25మంది లబ్ధిదారులకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేదవాడికి వెన్నంటి ఉండే మన ప్రజా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుందని, ప్రజా ప్రభుత్వానికి ప్రజల అండదండలు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. కలెక్టర్ టీఎస్ దివాకర, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

● గోవిందరావుపేట : మండలానికి చెందిన 15మంది లబ్ధిదారులకు మంత్రి ధనసరి సీతక్క ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా అధికారులు పని చేయాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేశారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతోపాటు రూ.500లకే గ్యాస్ సిలిండర్, ప్రతి ఇంటికి ఉచిత విద్యుత్ అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 4 : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ములుగులో జరిగిన సమావేశంలో నాయకులు పాల్గొని మాట్లాడారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఈనెల 9వ తేదీన జెండావిష్కరణ జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే సమావేశంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలైన పోడు భూములు, జీవో 3, ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతంలో వంద శాతం రిజర్వేషన్, తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మంకిడి రవి, నాయకులు కుంజ శ్రీను, అన్నవరం రవికాంత్, వట్టం శంకర్, కుంజ రవీందర్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రేగొండ, ఆగస్టు 4: మండలంలోని రూపిరెడ్డిపల్లి పరిధిలోని దమ్మన్నపేట క్రాస్ వద్ద ఆదివారం రెండు ప్రమాదాలు జరిగాయి. స్థానికులు తెలిపిన ప్రకారం... రూపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ యాకూబ్ పాషా ఆటోలో పరకాల వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పరకాల వైపు వెళ్తున్న కారు దమ్మన్నపేట క్రాస్ వద్ద వెనక వైపు నుంచి ఢీకొట్టింది. దీంతో యాకూబ్ పాషాకు గాయాలు కావడంతో పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈఘటనా స్థలంలోనే మరో ప్రమాదం జరిగింది. చెన్నాపూర్‌కు చెందిన ఒన్నాల ప్రశాంత్ బైక్‌పై రేగొండ వైపు వెళ్తుండగా ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ప్రశాంత్‌కు చేయి విరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

# సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందేలా చూడాలి

- కాంగ్రెస్ రాష్ట్ర నేత దుద్దిళ్ల శ్రీనుబాబు


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర నేత శ్రీనుబాబు

కాటారం, ఆగస్టు 4: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలందరికీ చేరేలా యూత్ కాంగ్రెస్ నాయకులు చూడాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు, కాంగ్రెస్ రాష్ట్ర నేత దుద్దిళ్ల శ్రీనుబాబు కోరారు. మండలంలోని ధన్వాడలో యూత్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల మంథని నియోజకవర్గ స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనుబాబు యూత్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రానున్న యూత్ కాంగ్రెస్ ఎన్నికలను పురస్కరించుకుని నియోజకవర్గంలో అత్యధికంగా సభ్యత్వాలు చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని 10 మండలాల పరిధిలో బరిలో ఉన్న అభ్యర్థులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. ప్రతీ ఒక్క యూత్ కాంగ్రెస్ కార్యకర్తకు సోదరుడిగా అండగా ఉంటానని, ఎవరూ అధైర్యం చెందవద్దని హామీ ఇచ్చారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎరవెల్లి విలాస్‌రావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండ కిషోర్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, మండలాల అధ్యక్షులు చీమల సందీప్, వంశీ, రాజేందర్, క్రాంతి ప్రవీణ్, రెబల్‌రాజు, శివ, రాహుల్, నజీరాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## చిక్కింది భారీ చేప

వాజేడు, ఆగస్టు 4: మండలంలోని చీకుపల్లికి చెందిన గొంది బాలు అనే యువకుడికి ఆదివారం భారీ చేప వలకు చిక్కింది. గ్రామ సమీపంలో ఉదయం చేపల వేటకు వెళ్లగా సుమారు 6.5కిలోలు ఉన్న చేప వలకు చిక్కడంతో బాలు ఎగిరిగెంతేశాడు. ఇటీవల వచ్చిన వరదలకు గోదావరికి కొత్తనీరు చేరడంతో భారీగా చేపలు పడుతున్నాయి. ఈ క్రమంలోనే చీకుపల్లి సమీపంలో ఉన్న వాగు వద్ద చేపలు పట్టేందుకు జనాలు క్యూ కడుతున్నారు.

## ప్రధాన రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం

మల్హర్, ఆగస్టు 4: కొయ్యూర్ నుంచి కాటారం వెళ్లే మార్గంలోని ప్రధాన రహదారిపై గుంత రూపంలో ప్రమాదం పొంచి ఉంది. ఎడ్లపల్లి క్రాస్ దాటిన తర్వాత రోడ్డు పక్కన పెద్ద గొయ్యి ఏర్పడింది. రాత్రి సమయంలో కొత్తవారు ఎవరైనా వస్తే ప్రమాదం సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నిత్యం ఈ రోడ్డు గుండా పదుల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

## తగ్గుతూ పెరుగుతున్న గోదావరి

- సమ్మక్క బ్యారేజీలోకి 6,54,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కన్నాయిగూడెం, ఆగస్టు 3: మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద ఆదివారం గోదావరి వరద తగ్గుతూ పెరుగుతోంది. శనివారం ఉదయంవరకు పెరిగిన గోదావరి రాత్రికి స్వల్పంగా పెరిగింది. ఆదివారం ఉదయం 6,62,780 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా నమోదై మధ్యాహ్నం 12 గంటల వరకు నిలకడగా ఉంది. సాయంత్రం 4గంటలకు స్వల్పంగా తగ్గుముఖం పట్టి 6,54,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, ఎలాంటి నీటి నిల్వలు చేయకుండా మొత్తం 59 గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు వదులుతున్నారు.

## అంధకారంలో రామప్ప

### పట్టించుకోని అధికారులు

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 4: మండలంలోని సుప్రసిద్ధ రామప్ప దేవాలయంలో అంధకారం నెలకొంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్ని వీధిదీపాలు వెలగడం లేదు. యునెస్కో గుర్తింపు పొంది దేశ నలుమూలల నుంచి పర్యాటకులు వస్తున్న తరుణంలో రామప్పలో కనీస వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దూరప్రాంతాల నుంచి వస్తున్న భక్తులకు, పర్యాటకులకు సాయంత్రం 6గంటలు దాటిందంటే దేవాలయం కనబడకపోవడంతో నిరాశతో వెనుతిరిగి పోతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. రామప్ప ఆలయ తూర్పు, పడమటి ద్వారాల నుంచి వచ్చి పర్యాటకులు రామలింగేశ్వరుడిని దర్శించుకుంటారు. కానీ, రెండు పక్కల నుంచి వచ్చే భక్తులు కారు చీకట్లో రామప్పకు రావాలంటే జంకుతున్నట్లు పాలంపేట వాసులు పేర్కొన్నారు. స్థానిక గ్రామపంచాయతీ అధికారులు, ఆలయ అధికారులు చర్యలు తీసుకుని రామప్పకు వెలుగులు ప్రసరింపజేయాలని కోరుతున్నారు.

## బదిలీపై వెళ్లిన కార్యదర్శులకు సన్మానం

మల్హర్, ఆగస్టు 4: మండలంలోని వల్లెంకుంటలో బదిలీపై వెళ్లిన కార్యదర్శులు కర్ణకంటి నరేష్, బంటు సమ్మరాజు, మారుపాక కుమారస్వామిలను అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడి శాలువాలతో సన్మానించారు. వారి సేవలకు గుర్తుగా వారి చిత్రపటాలను అందించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

రేగొండ, ఆగస్టు 4: మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామంలో విద్యుత్ షాక్‌తో పంచగిరి రమేష్ మృతి చెందగా ఆ కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. పరామర్శించిన వారిలో పీసీసీ కార్యదర్శి గాజర్ల అశోక్, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, ఇప్పకాయల నర్సన్న, మేకల బిక్షపతి, శంకరయ్య పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు ప్రభుత్వ సహాయం

మేడారం, ఆగస్టు 4 : ఐఐటీ, ఎన్ఐటీలో సీటు పొందిన 11మంది నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని మంత్రి సీతక్క ఆదివారం చెక్కుల రూపంలో అందించారు. మేడారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని చదువులో మంచి ఉత్తీర్ణత సాధించి ఫీజులకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న 11మందికి రూ.3,62,598 ఆర్థిక సహాయంను మంత్రి సీతక్క చేతుల మీదుగా కలెక్టర్ దివాకర, గిరిజన సంక్షేమం ప్రాజెక్టు అధికారి చిత్రామిశ్రా అందజేశారు. అదనపు కలెక్టర్ పి.శ్రీజ, మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై పశువుల సంచారం

- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



కాటారం, ఆగస్టు 4 : నిత్యం వందలాది వాహనాలు తిరిగే జాతీయ రహదారిపై రాత్రి, పగలు పశువులు సంచరిస్తుండటంతో వాహనదారులకు, పశువులకు సైతం ప్రమాదకరంగా మారింది. మండల కేంద్రమైన కాటారంలో ఆదివారం 353(సీ) జాతీయ రహదారిపై పదుల సంఖ్యలో పశువులు తిరుగుతుండటంతో వాహనదారులు బెంబేలెత్తిపోయారు. పశువులు నడిరోడ్డుపై పడుకోవడం, కొట్లాడుకోవడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. లారీల డ్రైవర్లు ఎంతసేపు హారన్ కొట్టినా పశువులు జరగకపోవడం గమనార్హం. ఇసుక, బొగ్గు లారీలు ఢీకొని పలు పశువులు మృతి చెందడం, పశువులను ఢీకొని ద్విచక్ర వాహనదారులు తీవ్ర గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, పంచాయతీ పాలకవర్గం స్పందించి పశువులను జాతీయ రహదారిపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా నేత దుర్గం తిరుపతితో పాటు పలువురు కోరుతున్నారు.

## శ్రావణం.. శివుడికి ప్రీతికరం

(5వ పేజీ తరువాయి)

కాలసర్ప దోష నివారణ పూజలు జరుగనున్నాయి. గ్రహాల దోషాలు, ఇతర ఇబ్బందులు ఉన్నవారు కాలసర్ప నివారణ దోష పూజలు, ప్రాతఃకాల పూజలు నిర్వహిస్తారు.

**అమ్మవార్లకు ప్రత్యేక పూజలు**

జ్ఞాన సరస్వతిదేవికి, శుభానందదేవికి శ్రావణ మాసం కుంకుమ పూజలు నిర్వహిస్తారు. ప్రత్యేక వ్రతాలు చేస్తారు. ఉదయం 4 గంటల నుంచే అమ్మవార్లను ముస్తాబు చేస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో మారుతి తెలిపారు.

## మేడారం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

(5వ పేజీ తరువాయి)

28 ఎకరాలలో స్మృతి వనం ఏర్పాటుకు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. పూజారుల అభిప్రాయాలను సేకరించి గద్దెలు, క్యూ లైన్ల విస్తరణ చేస్తామన్నారు. జంపన్నవాగు పరివాహకంలో పెద్దఎత్తున మొక్కల పెంపకం చేపట్టాలని తెలిపారు. పార్కులను నిర్మించాలన్నారు. మరుగు దొడ్లు, గ్రామ పరిసరాలు, అటవీ ప్రాంతాలలో సైక్లింగ్, వాకింగ్, ఎడ్లబండ్ల ప్రయాణం, పార్కు, అతిథి గృహాలు, వెడల్పు రహదారుల నిర్మాణం వంటి అభివృద్ధి పనులపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రూ.12కోట్లతో కాల్వపల్లి నుంచి ఊరట్టం అంతర్గత రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

జాతర పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులకు మంత్రి సీతక్క సూచించారు. ముఖ్యంగా ప్లాస్టిక్ నియంత్రణ చేపట్టి భక్తులకు అవగాహన కల్పించాలన్నారు. 163 జాతీయ రహదారిని సమ్మక్క, సారలమ్మ కారిడార్‌గా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఆయా ప్రదేశాలలో పర్యాటకుల సౌకర్యార్థం పార్కింగ్ సదుపాయం కల్పించాలన్నారు. జిల్లాలోని పర్యాటక, చారిత్రక ప్రదేశాల వివరాలు తెలియజేస్తూ పర్యాటకులను ఆకర్షించేందుకు చిహ్నాలు, థీమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. 5నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని ఆదేశించారు. గ్రామాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన అధికారులను స్వాతంత్ర్య దినోత్సవం రోజున సత్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మల్హార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం, జిల్లా వైద్యాధికారి అప్పయ్య, జిల్లా పర్యాటక శాఖ అధికారి సూర్యకిరణ్, ఎంపీడీవో సుమనవాణి, ములుగు డీఎస్పీ రవీందర్, మేడారం జాతర కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పాల్గొనాలి : సీఐ


వెంకటాపురంలో వాలీబాల్ క్రీడలను ప్రారంభిస్తున్న సీఐ కుమార్

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 4: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలని స్థానిక సీఐ బండారి కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో యాంటీ డ్రగ్స్ క్యాంపెయిన్‌లో భాగంగా మండల స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లు, మాదక ద్రవ్యాల వైపు వెళ్లకుండా శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలిగించే క్రీడల వైపుకు మలచాలనే ఉద్దేశంతో వాలీబాల్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో 18 జట్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతిరావు, సీఆర్పీఎఫ్ డీఎస్పీ ప్రశాంత్, ఫిజికల్ డైరెక్టర్ సత్యనారాయణ, పీఈటీలు గొంది హనుమంతు, నర్సింహమూర్తి, సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం

వాజేడు : క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని పేరూరు ఎస్సై కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం పేరూరులో స్టేషన్ పరిధిలోని యువతకు వాలీబాల్ పోటీలను నిర్వహించారు. మొత్తం 13 జట్లు పాల్గొనగా కడేకల్, కృష్ణాపురం జట్టు ఫైనల్‌కు చేరుకున్నాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణాపురం జట్టు విజయం సాధించింది. అంతకుముందు యువత చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని తెలుపుతూ 'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం-డ్రగ్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం' వాల్ పోస్టర్లను ఎస్సై యువతతో కలిసి ఆవిష్కరించారు. గెలుపొందిన జట్టుకు బహుమతులను అందజేశారు.